

ధరలు కనిష్టం.. కష్టాలు గరిష్టం

పొగాకు వేలంలో ధరలు నానాటికీ పడిపోతున్నాయి. అధిక సంఖ్యలో బేళ్లను తిరస్కరిస్తుండటంతో రైతులు అల్లాడుతున్నారు. - 8లో..



రాష్ట్రంలో అరాచక పాలన

రాష్ట్రంలో రెడ్‌బుక్ పేరుతో వైఎస్సార్ సీపీ నాయకులు, సామాన్యులపై కేసులు నమోదు చేస్తూ అరాచక పాలన సాగిస్తున్నారని మాజీ మంత్రి సురేష్ మండిపడ్డారు. - 8లో..

గరిష్టం/కనిష్టం
31 /25

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఒకటి రెండు చోట్ల ఉరుములు, మెరుపులతో జల్లులు పడవచ్చు.

న్యూస్‌రీల్

ఈనెల 31 వరకు అగ్నివీర్-వాయు ఉద్యోగాలకు దరఖాస్తులు

ఒంగోలు సిటీ: భారత రక్షణ శాఖ త్రివిధ దళాల రిక్రూట్‌మెంట్‌లో విప్లవాత్మకమైన సంస్కరణలకు శ్రీకారం చుడుతూ ఇటీవల నూతనంగా ప్రవేశపెట్టిన అగ్నిపథ్ పథకంలో భాగంగా పురుషులకు భారత వాయుసేనలో అగ్నివీర్, వాయు ఉద్యోగ నియామకాలకు జూలై 31వ తేదీ వరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు స్టెప్ సీఈఓ శ్రీమన్నారాయణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. భారత వాయుసేనలో పురుషులకు మెడికల్ అసిస్టెంట్ ట్రేడ్ ఉద్యోగాలకు ఇంటర్మీడియెట్, ఫార్మసీలో బీఎస్సీ లేదా మూడేళ్ల డిప్లొమా పూర్తి చేసుకొని, 50 శాతం మార్కులు కలిగి ఉండి 2 జూలై, 2002 నుంచి 2 జూలై, 2007 మధ్య జన్మించి ఉన్న అర్హులైన, ఆసక్తి కలిగిన అభ్యర్థులు తమ పేర్లను ఈనెల 31వ తేదీలోపు నమోదు చేసుకోవాలని కోరారు. మొదటగా రాత పరీక్ష నిర్వహిస్తారని, అందులో ఎంపికైన వారికి శరీర ధారుఢ్య పరీక్ష నిర్వహించి ఎంపిక చేస్తారని, అందుకు పురుషులు కనీస ఎత్తు 152 సెంటీమీటర్లు ఛాతి 5 సెం.మీ వ్యాకోచం చెందాలని తెలిపారు.

దర్శి గురుకులంలో ఖాళీల భర్తీకి దరఖాస్తులు

దర్శి: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల (బాలురు) కళాశాలలో పదో తరగతి, ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సరంలో చేరేందుకు దరఖాస్తులను 24వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు స్వీకరించనున్నట్లు ప్రిన్సిపాల్ ఎస్.మీరా సాహెబ్ ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతిలో ప్రవేశం పొందేందుకు 9వ తరగతి పూర్తి చేసిన విద్యార్థులు 60 శాతం మార్కులు సాధించిన వారు అర్హులని, ఇంటర్ మొదటి సంవత్సరంలో 50 శాతం మార్కులు సాధించిన వారు అర్హులని చెప్పారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

30న ఒంగోలు జాతి పశువుల బహిరంగ వేలం

నాగులుప్పలపాడు: చదలవాడ పశుక్షేత్రంలో ఈ నెల 30వ తేదీ ఒంగోలు జాతి పశువులకు బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు పశు ఉత్పత్తి క్షేత్రం ఉప సంచాలకుడు డా.బి.రవి తెలిపారు. ఈ వేలంలో ఒంగోలు జాతి ఒట్టి ఆవులు 13, పెయ్యలు 2, పెయ్య దూడలు 16, ఒంగోలు జాతి కోడె దూడలు 16 మొత్తం 47 పశువులకు చదలవాడ పశుక్షేత్రంలో 30వ తేదీ ఉదయం 11 గంటలకు వేలం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ వేలంలో పాల్గొనే రైతులు రూ.5 వేల ధరావత్తు చెల్లించాలన్నారు. వివరాలకు 93929 01049 నంబరును సంప్రదించాలన్నారు.

నర్సింగ్ చేసిన మహిళలకు జర్మన్ భాషలో ఉచిత శిక్షణ

ఒంగోలు వన్‌టౌన్: నర్సింగ్ కోర్సులు పూర్తి చేసిన ఎస్సీ, ఎస్టీ మహిళలకు జర్మన్ భాషలో ఉచిత శిక్షణ అందిస్తున్నట్లు జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎస్.లక్ష్మానాయక్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో రాష్ట్రంలో గుంటూరు, విశాఖపట్నం, తిరుపతి కేంద్రాల్లో పూర్తి ఉచిత వసతితో ఈ ఉచిత శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు. ఒక్కో కేంద్రంలో 25 మంది చొప్పున ఎస్సీ, ఎస్టీ మహిళలకు ఈ శిక్షణ అందించనున్నట్లు తెలిపారు. మొత్తం 8 నెలల నుంచి 10 నెలల పాటు ఈ శిక్షణ ఉంటుందన్నారు. అభ్యర్థులు బీఎస్సీ నర్సింగ్ చేసిన వారికి రెండేళ్లు, జీఎన్ఎం నర్సింగ్ చేసిన వారికి మూడేళ్ల క్లినికల్ అనుభవం ఉండాలన్నారు. 35 సంవత్సరాల వయస్సు లోపు ఉండాలన్నారు. అర్హులైన వారికి ఆధార్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రం, పాస్‌పోర్టు సైజు ఫొటో, నర్సింగ్ డిగ్రీ సర్టిఫికెట్, క్లినికల్ అనుభవం, ఏపీ నర్సింగ్ కౌన్సిల్ రిజిస్ట్రేషన్ ధ్రువీకరణ పత్రం ఉండాలని చెప్పారు. 8 నెలల నుంచి 10 నెలల శిక్షణ కాలంలో జర్మన్ లాంగ్వేజ్ బి2 స్థాయి పరీక్ష ఉత్తీర్ణత సాధించాలన్నారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ, తిరిగి మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5.30 వరకూ ఈ శిక్షణ ఉంటుందని తెలిపారు. తిరుపతిలో ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలికల కళాశాల వసతి గృహం, బైరాగి పట్టెడ, తిరుపతి, విశాఖపట్నంలో సాంఘిక సంక్షేమ కళాశాల బాలికల హాస్టల్, బోరవానిపాలెం, గుంటూరులో సాంఘిక సంక్షేమ హాస్టల్, బీఆర్ స్టేడియం ఎదురుగా శిక్షణ ఉంటుందన్నారు. దరఖాస్తులను స్కాన్ చేసి dydirsocialwelfare@gmail.com అనే చిరునామాకు పంపించాలన్నారు. అదే విధంగా హార్డ్ కాపీలను జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ కార్యాలయం, ప్రగతి భవన్, ఒంగోలు అనే చిరునామాలో అందించాలన్నారు. ఇతర పూర్తి వివరాలకు 9705589746, 7780469830 అనే నంబరు పై సంప్రదించాలని సూచించారు. దరఖాస్తులను ఈ నెల 29వ తేదీలోపు పంపించాలన్నారు. అర్హులైన నర్సింగ్ చేసిన మహిళలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

అంగన్‌వాడీలా..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అంగన్‌వాడీ కేంద్రాల అభివృద్ధిని పట్టించుకోకపోవడంతో పిల్లలను కేంద్రాలకు పంపించే తల్లిదండ్రులు ఆందోళనకు గురవుతున్నారు. సొంత భవనాలు లేక చాలా చోట్ల అద్దె భవనాల్లో కేంద్రాల నిర్వహిస్తుండగా, కొన్ని చోట్ల శిథిలావస్థకు చేరి ఖాళీగా ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో కేంద్రాలను నడిపిస్తున్నారు. కేంద్రాల్లో అరకొర సౌకర్యాలు, మరోవైపు రకరకాల యాప్‌ల భారంతో మానసిక ఒత్తిడికి గురవుతున్నామని అంగన్‌వాడీ సిబ్బంది వాపోతున్నారు.

- అరకొర వసతులతో కేంద్రాల నిర్వహణ
- జిల్లాలో అసంపూర్తిగా నిలిచిన భవన నిర్మాణాలు
- శిథిలావస్థ భవనాల్లో బిక్కుబిక్కుమంటూ కూర్చుంటున్న చిన్నారులు
- లింగోజిపల్లిలో బాలుడి అనుమానాస్పద మృతి ఘటనతో తల్లిదండ్రుల ఆందోళన
- పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపాలంటే జంకుతున్న వైనం



రావిపాడులో శిథిలావస్థలో ఉన్న పాఠశాల భవనంలో నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కేంద్రం

జిల్లాలోని అంగన్‌వాడీ ప్రాజెక్టులు	13
మొత్తం అంగన్‌వాడీ కేంద్రాలు	2903
మేజర్ కేంద్రాలు	2676
మైనర్ కేంద్రాలు	227
సొంత భవనాలు ఉన్నవి	1127
అద్దె రహిత భవనాలు	643
అద్దె భవనాలు	1133
కరెంటు సౌకర్యం లేని కేంద్రాలు	675
అసంపూర్తిగా నిలిచిన భవనాలు	100 కు పైనే

కంభం:

బాలింతలు, గర్భిణులకు పౌష్టికాహారం అందించడంతో పాటు ఆరేళ్ల లోపు చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్యనందించేందుకు ఏర్పాటు చేసిన అంగన్‌వాడీ కేంద్రాల్లో సరైన వసతులు, సౌకర్యాలు లేక తమ పిల్లలను అక్కడికి పంపించాలంటే తల్లిదండ్రులు జంకుతున్నారు. పోషకాహారం అందించడానికి, టీకాలు, ఆరోగ్య పరీక్షలు, ఇతర పనులన్నీ యాప్ లలో పొందుపరచాల్సి రావడంతో అదనపు భారం పడుతోందని, యాప్‌లు సక్రమంగా పనిచేయక, గ్రామీణ ప్రాంతాల్లో సిగ్నల్స్ సరిగ్గా లేకపోవడంతో మానసిక ఒత్తిడికి గురవుతున్నామని సిబ్బంది వాపోతున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో సౌకర్యాలు, వసతులు మెరుగుపరచి కేంద్రాలకు వచ్చే చిన్నారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

అరకొర సౌకర్యాలతో అవస్థలు:

జిల్లాలో ఉన్న 2903 అంగన్‌వాడీ కేంద్రాల్లో చాలా చోట్ల సరైన వసతులు, సౌకర్యాలు లేకపోవడంతో కేంద్రాల నిర్వహణ సిబ్బందికి భారంగా మారుతోంది. చాలా కేంద్రాల్లో విద్యుత్ సౌకర్యం, టాయిలెట్స్, మంచినీటి సౌకర్యం లేకపోవడంతో కేంద్రానికి వచ్చే చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారు. అంగన్‌వాడీ కేంద్రాలు గ్రామానికి చివరగా ఉండటం, కేంద్రాల చుట్టూ చిల్లచెట్లు పెరిగిపోవడంతో ఆ ప్రాంతాలు ప్రమాదకరంగా కనిపిస్తున్నాయి. కొన్ని కేంద్రాల్లో రాత్రి వేళల్లో మందుబాబులకు అడ్డాగా మారిపోతున్నాయని స్థానికులు చెబుతున్నారు.



చివరి దశలో నిర్మాణం నిలిచిపోయి నిరుపయోగంగా ఉన్న రావిపాడు అంగన్‌వాడీ కేంద్ర భవనం

జిల్లాలో 1133 అద్దె భవనాల్లో కేంద్రాల నిర్వహణ:

జిల్లాలో 1133 చోట్ల అద్దె భవనాల్లో కేంద్రాలు నిర్వహిస్తున్నారు. అద్దె భవనాల్లో సరైన సౌకర్యాలు, వసతులు లేకపోవడం, భవనాలు పాతబడి శిథిలావస్థకు చేరడంతో తల్లిదండ్రులు పిల్లలను పంపేందుకు జంకుతున్నారు. అద్దె భవనాలకు నెలనెలా అద్దెలు చెల్లించాల్సి ఉండగా అంగన్‌వాడీ టీచర్లు వారి జీతాల్లో నుంచి కట్టి ఆ డబ్బులు ప్రభుత్వం నుంచి విడుదలయ్యే వరకు ఎదురు చూపులు చూడాల్సిన పరిస్థితులు ఉన్నాయి.

శిథిలావస్థకు చేరిన గదుల్లో బిక్కుబిక్కుమంటూ..

సొంత భవనాలు, అద్దె భవనాలు లేని కొన్ని గ్రామాల్లో నిరుపయోగంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలల భవనాల్లోనే కేంద్రాల నిర్వహణ కొనసాగుతోంది. కొన్ని చోట్ల రెండు, మూడు కేంద్రాలను ఒకే ప్రాంగణంలో నిర్వహిస్తున్నారు. కొన్ని పాఠశాలల్లో గదులు పెచ్చులూడుతూ ప్రమాద ఘంటికలు మోగిస్తున్నాయి. కొన్ని కేంద్రాల్లో పిల్లలను గదుల్లో కూర్చోబెట్టడానికి భయపడి వరండాల్లో కూర్చోపెట్టి పిల్లలకు పాఠాలు బోధిస్తున్న దృశ్యాలు దర్శనమిస్తున్నాయి. కొన్ని గ్రామాల్లో భవనాలు కుంగిపోయి ప్రమాదకరంగా మారిపోతుండటంతో సమీపంలో ఉన్న మరో కేంద్రంలోకి వారిని కలిపేస్తున్నారు. ఇటీవల కాలంలో వర్షాలు కురుస్తుండటంతో గదులు కారుతుండటంతో పాటు శిథిలావస్థకు చేరిన పై కప్పులు ఎక్కడ కూలిపోతాయో అని దిన దినగండంగా గడుపుతున్నారు. ఏవైనా ప్రమాదాలు జరగకముందే అధికారులు చొరవచూపి ప్రమాదకరంగా ఉన్న భవనాల నుంచి పిల్లలను మరోచోటుకు మార్చాలని కోరుతున్నారు.

గతంలో నిలిచిపోయిన నిర్మాణాలకు మోక్షమెప్పుడు?

జిల్లాలో 2903 అంగన్‌వాడీ కేంద్రాల్లో 1127 చోట్ల మాత్రమే సొంత భవనాలుండగా 643 అద్దె రహిత భవనాలు, 1133 చోట్ల అద్దె భవనాల్లో కేంద్రాలు నిర్వహిస్తున్నారు. సుమారు పదేళ్ల క్రితం అంగన్‌వాడీ భవనాల నిర్మాణాలు చేపట్టి చివరి దశకు చేరుకొని ఆ తర్వాత నిర్మాణాలు నిలిచిపోయిన భవనాలు నేటికీ అలాగే నిరుపయోగంగా పడి ఉన్నాయి. 90 శాతం నిర్మాణాలు పూర్తి చేసుకొని ప్రస్తుతం నిరుపయోగంగా ఉన్న భవనాల నిర్మాణాలు పూర్తి చేసి వినియోగంలోకి తీసుకొస్తే ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది.

లింగోజీపల్లి ఘటనతో ఉలిక్కిపడిన తల్లిదండ్రులు:

ఈనెల 8వ తేదీ కంభం మండలం లింగోజీపల్లి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం నుంచి సుమారు మూడేళ్ల వయస్సున్న లక్షిత్ అనే బాలుడు అదృశ్యమై 10వ తేదీ సూరేపల్లి సమీపంలోని పంట పొలాల్లో అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. ఈ ఘటనపై విచారణ చేసిన ఉన్నతాధికారులు సిబ్బందిని విధుల్లో నుంచి తొలగించేశారు. ఈ ఘటన జరిగిన నేపథ్యంలో తల్లిదండ్రులు తమ పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలంటే భయపడుతున్నారు. కేంద్రాల్లో సిబ్బంది నిర్లక్ష్యంగా ఉండకుండా చర్యలు తీసుకోవడంతో పాటు సౌకర్యాలు మెరుగుపరచాలని డిమాండ్ చేస్తున్నారు.

యాప్‌లతో ఒత్తిడికి గురవుతున్న సిబ్బంది



ఎఫ్ఆర్ఎస్ యాప్‌తో ఉద్యోగులు మానసిక ఒత్తిడికి గురవుతున్నారు. గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందించే సమయంలో యాప్ పనిచేయక, ఓటీపీలు రాక సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. పాత పద్ధతిలోనే మాన్యువల్‌గానే ఫీడింగ్ అందించాలి. అప్పుడే వారు స్వేచ్ఛగా పిల్లలకు ఆటపాటలతో కూడిన పాఠాలు చెప్పగలరు.

– షేక్ అన్వర్ బాషా, గౌరవ అధ్యక్షుడు అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్, బేస్తవారిపేట ఐసీడీఎస్ ప్రాజెక్టు

అసంపూర్తిగా ఉన్న భవన నిర్మాణాలు వెంటనే పూర్తి చేయాలి



దాదాపు 90 శాతం పనులు పూర్తయి కొన్నేళ్లుగా నిరుపయోగంగా పడి ఉన్న అంగన్‌వాడీ కేంద్రాల నిర్మాణాలను వెంటనే పూర్తి చేసి వాటిని వినియోగంలోకి తీసుకొచ్చేలా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలి. పిల్లలు, గర్భిణులు, బాలింతలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా వసతులు, సౌకర్యాలు మెరుగుపరచాలి.

– షేక్ జరీనా, వైఎస్సార్ సీపీ మహిళా అధ్యక్షురాలు, కంభం మండలం



ఈనెల 8వ తేదీ బాలుడు అదృశ్యమైన లింగోజిపల్లి అంగన్‌వాడీ కేంద్రం



సైదాపురం అంగన్‌వాడీ కేంద్రంలో పెచ్చులూడుతున్న పైకప్పు



కంభం మండలం సైదాపురం అంగన్‌వాడీ కేంద్రం భవనం పక్కన తాగిపడేసిన మద్యం సీసాలు



కందులాపురం గ్రామంలో కుంగిపోయిన అంగన్‌వాడీ భవనం



కందులాపురం అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులు

మహిళలకు మీరిచ్చే గౌరవం ఇదేనా..?

- ‘ఆడబిడ్డ నిధి’పై అచ్చన్నాయుడు వ్యాఖ్యలపై బూచేపల్లి మండిపాటు

దర్శి: ఎన్నికల ముందు ఇంటింటికీ వెళ్లి ఎంతమంది మహిళలుంటే అంతమందికీ ప్రతి మహిళకు రూ.1500 ఇస్తామన్నారు. ఎన్నికలు అయిపోయాక ‘ఆడబిడ్డ నిధి’ అమలు చేయాలంటే ఆంధ్రాను అమ్మాలని అన్న అచ్చన్నాయుడు వ్యాఖ్యలపై దర్శి ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి తీవ్రంగా మండిపడ్డారు. 18 నుంచి 59 సంవత్సరాలున్న ఒక్కో మహిళకు సంవత్సరానికి రూ.18 వేలు చొప్పున సుమారు 2 కోట్ల మంది మహిళలకు దాదాపు రూ.33 వేల కోట్లు ఇప్పటికే ఇవ్వాల్సి ఉందన్నారు. ఏరు దాటే దాకా ఏరు మల్లన్న.. ఏరు దాటాక బోడి మల్లన్న అన్నట్లు కూటమి ప్రభుత్వం తీరు ఉందని దుయ్యబట్టారు. ఒక్క పథకాన్ని అమలు చేయాలంటేనే ఆంధ్రప్రదేశ్‌ను అమ్మేయాలని చెప్పే మీరు 143 హామీలు ఎలా ఇచ్చారని, అది ప్రజలను మోసం చేయడం కాదా అని కూటమి నాయకులను ప్రశ్నించారు. మహిళలను మోసం చేసేందుకే ఈ వ్యాఖ్యలు చేస్తున్నారని మండిపడ్డారు. ఎన్నికలు ముందు ఆశపెట్టి ఓట్లేయించుకుని అధికారంలోకి వచ్చిన సంవత్సరం తరువాత కూడా వారికి డబ్బులు చెల్లించకుండా దారుణంగా మోసగిస్తున్న కూటమి ప్రభుత్వానికి మహిళలు తగిన బుద్ధి చెప్తారని హెచ్చరించారు. ఎన్నికల ముందు ఇచ్చిన ప్రధాన హామీనే అమలు చేయలేకపోతే మిగతా హామీల పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. ఆడబిడ్డ నిధి పథకం అమలు చేయకపోతే మహిళల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు.



బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి

నిత్యావసరాలకు కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు

- వ్యవసాయ అనుబంధ విభాగాల అధికారులతో జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ

ఒంగోలు సబర్బన్: నిత్యావసర సరుకులకు కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు తప్పవని జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ హెచ్చరించారు. వ్యాపారులు అలాంటి చర్యలకు పూనుకుంటే సంబంధిత అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఉండాలన్నారు. ఈ మేరకు మంగళవారం తన ఛాంబర్లో వ్యవసాయ అనుబంధ శాఖలు, మార్కెటింగ్ శాఖ అధికారులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వ్యవసాయ, ఉద్యాన, పౌరసరఫరాలు, మార్కెటింగ్ శాఖ అధికారులు, రైతులు, కూరగాయల వ్యాపారులు, రైతు బజార్ల ఎస్టేట్ అధికారులతో నిర్వహించిన సమీక్షలో స్పష్టమైన ఆదేశాలిచ్చారు. ప్రస్తుతం మార్కెట్లో టమోటా, ఉల్లి ధరలు స్థిరంగా ఉన్నాయని, రాబోయే రోజుల్లో టమోటా, ఉల్లి ధరలు పెరిగితే చిత్తూరు, కర్నూలు జిల్లాల్లోని మార్కెట్ల నుంచి ధరల స్థిరీకరణ నిధిని ఉపయోగించుకొని దిగుమతి చేసుకోవాలన్నారు. వాటిని ప్రజలకు సరసమైన ధరలకు లాభ, నష్టాలు లేకుండా అందజేయాలన్నారు.

రైతు బజార్ల ద్వారా మార్కెటింగ్ చేయాలన్నారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా కూరగాయలు పండించే రైతులను ప్రోత్సహిస్తూ ప్రతి రైతు బజారులో స్టాలు కేటాయించాలని కూడా అధికారులను ఆదేశించారు.



వ్యవసాయ అనుబంధ శాఖ, మార్కెటింగ్ అధికారులతో సమావేశంలో మాట్లాడుతున్న జేసీ గోపాలకృష్ణ

మెడికల్ షాపుల్లో డ్రగ్, విజిలెన్స్ అధికారుల తనిఖీలు

- జనరిక్ మందులు ఎమ్మార్పీకి విక్రయిస్తున్నట్లు గుర్తింపు



మార్కాపురంలో తనిఖీలు చేస్తున్న డ్రగ్ ఇన్‌స్పెక్టర్ ఉషారాణి, అధికారుల బృందం

సాక్షి ఎఫెక్ట్..

మార్కాపురం: జిల్లాలోని ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్ట్‌కు చెందిన ఆస్పత్రుల్లోని మెడికల్ షాపులతో సహా మొత్తం 16 మెడికల్ షాపులను ప్రకాశం, గుంటూరు, ఎస్‌పీఎస్ఆర్ నెల్లూరు జిల్లాల నుంచి వచ్చిన 8 మంది డ్రగ్ ఇన్‌స్పెక్టర్లతో మూడు బృందాలు మంగళవారం తనిఖీ చేశాయి. ఈనెల 18న ‘సాక్షి’లో ‘‘మందుబిళ్ల ...జేబుగుల్ల’’ శీర్షికన వార్త ప్రచురితమైంది. తక్కువ ధరకు విక్రయించాల్సిన జనరిక్ మందులను ఎమ్ఆర్‌పీకే విక్రయిస్తూ ప్రజలను ఇబ్బంది పెడుతున్న విషయాన్ని వెలుగులోకి తెచ్చింది. దీనిపై స్పందించిన డ్రగ్, విజిలెన్స్ అధికారులు ఈ తనిఖీలు చేపట్టారు. మార్కాపురం, ఒంగోలు, కనిగిరి ప్రాంతాల్లో ఉన్న మెడికల్ షాపుల్లో తనిఖీలు చేశారు. తనిఖీల సమయంలో 12 ఔషధ నమూనాలు సేకరించారు. వాటిని ప్రభుత్వ ఔషధ పరీక్ష ప్రయోగశాలకి పంపించి పరీక్షించనున్నారు. ఔషధ నియంత్రణ శాఖ అడిషనల్ డైరెక్టర్ జ్యోతి ఆధ్వర్యంలో నిర్వహించిన తనిఖీల్లో మార్కాపురం డ్రగ్ ఇన్‌స్పెక్టర్ ఉషారాణి, గుంటూరు విజిలెన్స్ అధికారి సాంబశివరావు, మహేష్ తదితరులు ఉన్నారు. జనరిక్ మందులకు వస్తున్న తగ్గింపును వినియోగదారులకు ఇవ్వకుండా ఎమ్ఆర్‌పీకే విక్రయిస్తున్న విషయాన్ని గుర్తించినట్లు తెలిపారు.

బంగారు కుటుంబాలకు మార్గదర్శకులవ్వాలి

- వ్యాపారుల అసోసియేషన్లతో జాయింట్ కలెక్టర్ సమావేశాలు

ఒంగోలు సబర్బన్: రాష్ట్ర ప్రభుత్వం వినూత్నంగా ప్రవేశపెట్టిన పీ–4 పథకానికి సంబంధించి బంగారు కుటుంబాలకు మార్గదర్శకులుగా నిలవాలని జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ పిలుపునిచ్చారు. ఈ మేరకు కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో మంగళవారం వివిధ వ్యాపార సంస్థలకు చెందిన అసోసియేషన్ నాయకులతో విడివిడిగా సమావేశాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా హోల్ సేల్ డీలర్స్ అసోసియేషన్స్, రైస్ మిల్లర్స్ అసోసియేషన్స్, ఎల్పీజీ గ్యాస్ డీలర్స్ అసోసియేషన్స్, పెట్రోల్ బంకు డీలర్స్ అసోసియేషన్స్, హోటల్స్–రెస్టారెంట్స్ అసోసియేషన్స్, తూనికలు–కొలతల డీలర్స్ అసోసియేషన్స్ ప్రత్యేకంగా సమావేశాలు ఏర్పాటు చేశారు. జేసీ మాట్లాడుతూ పీ–4 పథకంలోని బంగారు కుటుంబాలకు సహాయంగా నిలబడేందుకు తమ వంతు బాధ్యతగా ప్రతి ఒక్కరూ ముందుకు రావాలన్నారు. పీ–4 పథకంపై జాయింట్ కలెక్టర్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. కార్యక్రమంలో డీఎస్ఓ పద్మశ్రీ. సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ డీఎం వరలక్ష్మితో పాటు పలువురు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జేసీ గోపాలకృష్ణ, పక్కన డీఎస్ఓ పద్మశ్రీ

పదో రోజుకు చేరిన పారిశుధ్య కార్మికుల సమ్మె



ఒంగోలు నగరపాలక సంస్థ కార్యాలయం ముందు ధర్నా చేస్తున్న పారిశుధ్య కార్మికులు

- తాత్కాలికంగా సమ్మె విరమించిన ఇంజినీరింగ్ కార్మికులు

ఒంగోలు సబర్బన్: ఒంగోలు నగర పాలక సంస్థ పారిశుధ్య కార్మికుల సమ్మె మంగళవారంతో పదో రోజుకు చేరింది. ఈ సందర్భంగా పారిశుధ్య కార్మికులు, ఇంజినీరింగ్ విభాగం కార్మికులు యథావిధిగా సమ్మె చేపట్టారు. అయితే రాష్ట్ర ప్రభుత్వం జీఓ నంబర్–124ను విడుదల చేయడంతో ఇంజినీరింగ్ విభాగం కార్మికులు మంగళవారంతో సమ్మెను తాత్కాలికంగా విరమిస్తున్నట్లు ప్రకటించారు. నగర కమిషనర్ సమ్మె శిబిరానికి వచ్చి రాష్ట్ర ప్రభుత్వం ఇంజినీరింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించేందుకు సుముఖంగా ఉందని చెప్పారు. అయితే విడుదల చేసిన జీఓ ప్రకారం కాకుండా తమ న్యాయమైన డిమాండ్లు తీరిస్తేనే ఊరుకుంటామని, లేకుంటే తిరిగి సమ్మె మొదలు పెడతామని ఇంజినీరింగ్ విభాగం కార్మికులు తెగేసి చెప్పారు. పారిశుధ్య కార్మికులు మాత్రం యథావిధిగా సమ్మెను కొనసాగించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.రమేష్ సమ్మెకు మద్దతు ప్రకటించారు. పారిశుధ్య కార్మికుల న్యాయమైన డిమాండ్లు ప్రభుత్వం నెరవేర్చే వరకూ సమ్మె కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో పలువురు యూనియన్ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

పంటలకు కనీస గిట్టుబాటు ధర కల్పించాల్సిన కూటమి సర్కారు.. రైతులను కష్టాల కొలిమిలోకి నెట్టి చలికాచుకుంటోంది. పెట్టుబడి సొమ్ము కూడా చేతికిరాలేదని గత ఏడాది నుంచి రైతులు గగ్గోలు పెడుతుంటే.. రాష్ట్రం సుభిక్షంగా ఉందని, రైతులు సంతోషంగా ఉన్నారని చెప్పేందుకు కూటమి ప్రభుత్వ పెద్దలు తెగ తాపత్రయ పడుతున్న తీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మిర్చి, కంది, శనగ రైతుల బాటలోనే ఈ ఏడాది పొగాకు రైతులు భారీ నష్టాలను మూటగట్టుకున్నారు. మార్క్‌ఫెడ్‌ను రంగంలోకి దించాలని పొగాకు రైతులు రోడ్డెక్కి నిరసన తెలుపుతున్నా సర్కారు నుంచి కనీస స్పందన కరువైంది. రైతులు ధరల కోసం అర్థిస్తుంటే ఆవగింజంతైనా కనికరం చూపని సీఎం చంద్రబాబునాయుడు.. ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ నటించిన సినిమా టికెట్ల ధరలు పెంచుకునేందుకు అనుమతించడం సర్వత్రా చర్చనీయాంశమైంది. 'మీ కోరిక మేరకు ఈ రోజు టికెట్ రేట్స్ పెరిగి ప్రభుత్వం మనదొచ్చి, మన సినిమా ఇప్పుడు రిలీజవుతోంది' అని డిప్యూటీ సీఎం చేసిన వ్యాఖ్యలపై రైతులు మండిపడుతున్నారు.

ధరలు కనిష్టం.. కష్టాలు గరిష్టం!

జిల్లాలోని వేలం కేంద్రాల్లో రికార్డు స్థాయిలో 1.24 లక్షల బేళ్ల తిరస్కరణ

- పొగాకు వేలం ప్రారంభం నుంచే వ్యాపారుల సిండికేట్
- కూటమి ప్రభుత్వం, టుబాకో బోర్డు తీరుతో తీవ్రంగా నష్టపోయిన రైతులు
- పంటల ధర పెంచమంటుంటే.. సినిమాల రేట్లు పెంచుతారా?
- కూటమి సర్కారుపై మండిపడుతున్న రైతులు



టంగుటూరులో ఆందోళన చేస్తున్న రైతులతో మాట్లాడుతున్న వేలం నిర్వహణాధికారి(ఫైల్)

పొగాకు బేళ్ల కొనుగోలు వివరాలు

బోర్డు	వేలనికి వచ్చిన బేళ్లు	కొనుగోలు చేసింది	తిరస్కరించినది
వెల్లంపల్లి	67092	55913	20198
ఒంగోలు-1	93,499	67,297	24794
ఒంగోలు-2	72017	52013	19,124
టంగుటూరు	69,182	54,188	13776
కొండపి	83098	65,244	16434
పొదిలి	80933	53,649	25857
కనిగిరి	48,373	33,236	14212

(నోట్ : గణాంకాలు వేలం ప్రారంభం నాటి నుంచి నేటి వరకు)

టంగుటూరు:

గిట్టుబాటు ధర లేక ఇబ్బంది పడుతున్న పొగాకు రైతులు.. బేళ్ల తిరస్కరణతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జిల్లా పరిధిలోని 7 వేలం కేంద్రాల్లో పొగాకు కొనుగోళ్ల ప్రక్రియ రైతులను తీవ్ర నిరాశకు గురిచేస్తోంది. గత రెండేళ్లలో పొగాకు ధరలు ఆశాజనకంగా ఉండటంతో రైతులు ఈ దఫా పొగాకు సాగుపై అమితాసక్తి చూపారు. జిల్లాలో 24,130 బ్యారన్ల కింద 67 వేల హెక్టార్లలో 105.27 మిలియన్ కిలోల పొగాకు పండించేందుకు టుబాకో బోర్డు అనుమతించింది. అయితే రైతులు 144 మిలియన్ కిలోల పొగాకు పండించినట్లు బోర్డు అధికారులు అంచనా వేస్తున్నారు. 2024-25 పంట కాలానికి సంబంధించి మార్చి నెల మూడో వారంలో పొగాకు వేలాన్ని ప్రారంభించగా.. ఆది నుంచే గిట్టబాటు ధర కల్పించాలని రైతులు గగ్గోలు పెడుతున్నారు. వేలం ప్రారంభంలో పొగాకు గరిష్ట ధర కేజీ రూ.280, కనిష్ట ధర కేజీరూ 240గా ఉంది. ఇవే ధరలు కొన్ని రోజులు కొనసాగాయి. వేలం సాగేకొద్దీ ధరలు పెరుగుతాయని ఆశించిన రైతులు.. రోజులు గడుస్తున్నకొద్దీ ధరలు తగ్గుముఖం పట్టడాన్ని చూసి ఆందోళనకు గురయ్యారు. గత ఏడాది కేజీ రూ.360 పలికిన పొగాకు ఈ ఏడాది రూ.240కు మించకపోవడంతో రైతులు తీవ్ర నష్టాల్లో కూరుకుపోయారు. పొగాకు కనిష్ట ధర కేజీ రూ.160కి పడిపోయింది. వేలం ప్రారంభం నుంచి ఇప్పటి వరకు కనిష్ట ధర కేజీకి 80 రూపాయల మేర తగ్గడంతో రైతులు లబోదిబోమంటున్నారు.

లోగ్రేడా.. తీసెయ్ తీసెయ్..

వేలానికి తీసుకొచ్చిన లోగ్రేడ్ పొగాకును వ్యాపారులు పదేపదే తిరస్కరిస్తుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. గతంలో లోగ్రేడ్ పొగాకును ఎగబడి కొనుగోలు చేసిన వ్యాపారులు ఈ ఏడాది అటువైపు కన్నెత్తి చూడకపోవడంతో రైతులకు దిక్కుతోచని పరిస్థితి. అధిక సంఖ్యలో బేళ్లను తిరస్కరిస్తూ, లోగ్రేడ్ బేళ్లను అసలు కొనుగోలు చేయకపోవడంతో టంగుటూరులో రెండు రోజుల క్రితం రైతులు వేలాన్ని అడ్డుకున్నారు. అన్ని బేళ్లు కొనుగోలు చేస్తామని అధికారులు హామీ ఇవ్వడంతో వేలం తిరిగి మొదలైనప్పటికీ పరిస్థితిలో ఎలాంటి మార్పులేదు.



మూడు రోజుల క్రితం బేస్తవారిపేట మండలం సలకలవీడు వద్ద హైవేపై బేళ్లు తగలబెట్టి రైతుల నిరసన

తిరస్కరణతో అదనపు భారం

బేళ్ల తిరస్కరణతో అదనపు ఆర్థిక భారం పడుతోందని రైతులు వాపోతున్నారు. జిల్లాలో వేలం మొదలైనప్పటి నుంచి ఇప్పటి వరకు ఒక్కో కేంద్రంలో కనీసం 20 వేల బేళ్లను తిరస్కరించినట్లు గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. బేళ్లను వేలం కేంద్రం నుంచి ఇంటికి తీసుకెళ్లి తిరిగి తెచ్చే క్రమంలో ఐదు నుంచి పది కేజీల వరకు తూకం తగ్గుతోందని, ఒక్కో బేల్‌పై రూ.2 వేల వరకు నష్టం వస్తోందని, అదనపు శ్రమ పెరుగుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బేళ్లను తిరస్కరించకుండా కనీస ధరకైనా కొనుగోలు చేస్తే కొంతమేరైనా నష్టాన్ని పూడ్చుకునే అవకాశం ఉంటుందన్నది రైతుల వాదన. ఓ వైపు కూలి సొమ్ము చెల్లించాలని కూలీలు ఒత్తిడి చేస్తుండటం.. మరోవైపు కనీస గిట్టుబాటు ధర లేకపోవడం, బేళ్లను పదే పదే తిరస్కరిస్తుండటంతో రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. వ్యాపారుల సిండికేట్‌తో బోర్డు అధికారులు కుమ్మక్కై పొగాకు రైతులను నిలువునా ముంచుతున్నారని, ప్రభుత్వం స్పందించి గిట్టుబాటు ధర కల్పించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

అన్ని బేళ్లు కొనాలి



వేలానికి తీసుకొచ్చే అన్ని బేళ్లను కొనుగోలు చేసి, రైతులకు గిట్టుబాటు ధర కల్పించి ఆదుకోవాలి. కూలీలు డబ్బు కోసం ఒత్తిడి చేస్తున్నారు. పొగాకు అమ్మి డబ్బులిస్తామంటే ఇప్పటి వరకు ఆగారు. బోర్డులో చూస్తే పొగాకు అమ్ముడు పోక ఏమి చేయాలో దిక్కు తోచని పరిస్థితిలో ఉన్నాం. గిట్టుబాటు ధర కల్పించకపోతే తీవ్ర నష్టాల్లో కూరుకుపోతాం.

– కొత్తపల్లి శ్రీనివాసులు, జమ్ములపాలెం(టంగుటూరు)

మార్క్‌ఫెడ్‌ను రంగంలోకి దించాలి



ప్రభుత్వం వెంటనే మార్క్‌ఫెడ్‌ను రంగంలోకి దించి పొగాకు కొనుగోలు చేయాలి. వ్యాపారుల కుమ్మక్కై ధరలను దిగ్గోస్తూ లో గ్రేడ్ పొగాకు బేళ్లను కొనుగోలు చేయడం లేదు. ఇళ్ల వద్దనే బేళ్లు అధిక సంఖ్యలో ఉన్నాయి. వేలాన్ని అడ్డుకుంటే అప్పటికప్పుడే చిన్న చిన్న హామీలతో రైతులను బుజ్జగిస్తూ తిరిగి కొనసాగిస్తున్నారు. బోర్డు అధికారులు, ప్రభుత్వాలు రైతుల పరిస్థితిని అర్థం చేసుకుని పొగాకు కొనుగోలు చేయాలి.

– సింగమనేని బ్రహ్మయ్య. మర్లపాడు

ఎయిడెడ్ స్కూళ్ల నిర్వహణపై డీఈఓ ఆగ్రహం

కొమరోలు: మండలంలోని పలు ప్రభుత్వ ఎయిడెడ్ పాఠశాలలను డీఈఓ కిరణ్‌కుమార్ మంగళవారం తనిఖీ చేశారు. ఎస్‌బీఎస్ఆర్ఎం ఎయిడెడ్ పాఠశాల ప్రాంగణంలో ప్రైవేట్ స్కూల్ వ్యాన్లను పార్కింగ్ చేయడంతో హెచ్ఎం బందుగుల సుబ్బారెడ్డిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏబీఎం ఎయిడెడ్ పాఠశాలలో అటెండెన్స్ రిజిస్టర్‌లో ఉన్న రోల్‌కు, హాజరైన విద్యార్థుల సంఖ్యకు భారీ వ్యత్యాసం ఉండటంతో హెచ్ఎం పొట్టి సుబ్బారావుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏబీఎం ప్రాథమిక పాఠశాలలో 93 మందికిగాను నలుగురే హాజరుకాగా 47 మందికి హాజరు వేయడం, 22 మంది విద్యార్థులు మధ్యాహ్న భోజనం తిన్నట్లుగా రికార్డులో చూపించడంపై హెచ్ఎంను ప్రశ్నించారు. అలాగే ఏబీఎం ఎయిడెడ్ ఉన్నత పాఠశాలలో 75 మంది విద్యార్థులకుగాను 8 మందే హాజరుకాగా 43 మంది వచ్చినట్లు, 22 మంది మధ్యాహ్న భోజనం తిన్నట్లు రికార్డులో చూపడంపై అసహనం వ్యక్తం చేశారు.

ఆ గణిత ఉపాధ్యాయుడిపై చర్యలు

కొమరోలు ప్రభుత్వ ఉన్నత పాఠశాలను డీఈఓ తనిఖీ చేశారు. పాఠశాలలో వసతులు, ఉపాధ్యాయుల విద్యాబోధన, సమస్యలపై విద్యార్థులను ఆరాతీశారు. అనంతరం ఉపాధ్యాయులతో మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు మెరుగైన విద్య అందించాలని స్పష్టం చేశారు. గత విద్యా సంవత్సరంలో 10వ తరగతి పబ్లిక్ పరీక్షల్లో గణితంలో 84 మంది విద్యార్థులు ఫెయిలైన నేపథ్యంలో గణిత ఉపాధ్యాయుడు అశ్వనీకుమార్‌పై చర్యలు తీసుకుంటామని డీఈఓ చెప్పారు.

పెరల్ డిస్టిలరీలో ఎక్సైజ్ తనిఖీలు

సింగరాయకొండ: పెరల్ డిస్టిలరీ కంపెనీలో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ జిల్లా డిప్యూటీ కమిషనర్ హేమంత్ నాగరాజు, ఎక్సైజ్ సూపరింటెండెంట్ షేక్ ఆయేషా బేగం మంగళవారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మద్యం కేసుల తయారీకి, రికార్డుల ప్రకారం స్టాక్ ఉన్నదా అని పరిశీలించారు. తరువాత ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయంలో మద్యం కేసులో సీజ్ చేసిన ఎలక్ట్రికల్ స్కూటర్ వేలం వేశారు. ఎక్సైజ్ సీఐ శివకుమారి, సిబ్బంది పాల్గొన్నారు.



మద్యం కేసులు తనిఖీ చేస్తున్న ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ హేమంత్ నాగరాజు

రాష్ట్రంలో అరాచక పాలన..!

- అభివృద్ధి, సంక్షేమం వదిలేసి అక్రమ కేసులతో వేధింపు
- కూటమి ప్రభుత్వ మోసాలను ప్రతి గడపకు వివరిద్దాం
- వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యులు, మాజీ మంత్రి ఆదిమూలపు సురేష్



మాట్లాడుతున్న మాజీ మంత్రి ఆదిమూలపు సురేష్

పొన్నలూరు: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రెడ్ బుక్ పేరుతో వైఎస్సార్‌సీపీ శ్రేణులు, సామాన్య ప్రజలపై దాడులు, కేసులు పెడుతూ అరాచక పాలన కొనసాగిస్తుందని వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యుడు, మాజీ మంత్రి ఆదిమూలపు సురేష్ అన్నారు. బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా పొన్నలూరులో మంగళవారం వైఎస్సార్‌సీపీ మండల స్థాయి విస్తృత సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదిమూలపు సురేష్ మాట్లాడుతూ చంద్రబాబు అధికారంలోకి రావడానికి సూపర్ సిక్స్‌తో పాటు 143 హామీలను ఇచ్చి అధికారం చేపట్టి 13 నెలలు అవుతున్నా ఒక్క హామీని కూడా సక్రమంగా అమలు చేయకుండా ప్రజలను నిలువునా మోసం చేశాడన్నారు. సంపద సృష్టిస్తానని రాష్ట్ర సంపదను తన అనుచరులు, పెట్టుబడీదారులకు దోచిపెడుతున్నారన్నారు. అడబిడ్డ నిధి పథకం ద్వారా మహిళలకు నెలకు రూ.1500 ఇవ్వాలంటే రాష్ట్రాన్ని అమ్మాలంటూ మంత్రి అచ్చెంనాయుడు అనడం కూటమి ప్రభుత్వం చేతగానితనానికి నిదర్శనమన్నారు. ప్రజలను మోసం చేయడం చంద్రబాబు నైజమన్నారు. పీ4 పేరుతో మోసపు మాటలు అల్లుతూ చంద్రబాబు అమాయక పేద ప్రజలను మభ్యపెడుతున్నారన్నారు. ఎన్నికల సమయంలో చంద్రబాబు ఇచ్చిన హామీలకే గతిలేదని, ఇప్పుడు 2049 విజన్ పేరుతో ప్రజలను మభ్య పెడుతున్నారన్నారు.

ఎల్లో మీడియాలోనే హామీల అమలు....

కూటమి ప్రభుత్వం హామీలన్నీ ఎలో మీడియా, పేపర్లలో కనిపిస్తాయని, ఆచరణలో అవి అమలు కావని ఎద్దేవా చేశారు. ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని తుంగలో తొక్కి ఎన్ని రోజులు రాష్ట్రంలో మారణకాండ సృష్టిస్తారని ప్రశ్నించారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నించిన వారిపై అక్రమ కేసులు బనాయించడం తప్పా ప్రజలకు ఒరిగిందేమి లేదన్నారు. రాష్ట్రంలో రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు లేవని, కానీ కూటమి నేతలు పండించి రవాణా చేస్తున్న గంజాయి పంటకు మాత్రం మంచి ధరలు కల్పిస్తున్నారని విమర్శించారు. 13 నెలల కూటమి పాలనలో రూ, 1.83 లక్షల కోట్లు అప్పులు చేసి ప్రతి మంగళవారాన్ని అప్పుల వారంగా మార్చారని విమర్శించారు.

తమ్ముళ్లకే సంక్షేమ శాఖ మంత్రి....

కొండపి నియోజకవర్గంలో సాంఘిక సంక్షేమశాఖ మంత్రి స్వామి ఇసుక, మట్టి, బియ్యం దోపిడీలకు పాల్పడుతున్న తెలుగు తమ్ముళ్ల సంక్షేమానికి అండగా నిలుస్తున్నాడు తప్ప సామాన్య ప్రజలకు చేసిందేమిలేదన్నారు. రాష్ట్రంలో సంక్షేమ హాస్టల్స్ పరిస్థితి మరి దారుణంగా ఉన్నాయని హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసిందంటే మంత్రి స్వామి, కూటమి ప్రభుత్వం పనితీరు ఇట్టే తెలుస్తుందన్నారు. జెడ్పీటీసీ బెజవాడ వెంకటేశ్వర్లు, మండల కన్వీనర్ దుద్దుగుంట మల్లికార్జునరెడ్డి, పిల్లి తిరుపతిరెడ్డి, మన్నెం చిన్న వెంకటేశ్వర్లు, కాటా మాధవరావు, పల్నాటి వెంకటేశ్వరరెడ్డి, గడ్డం మాల్యాద్రి, కాటా మల్లికార్జున, కనపర్తి గోవిందమ్మ, గుత్తికొండ కళ్యాణి, దారా మాధవరావు, గొడపేరు విజయ్, కొల్లిపూడి గురుబ్రహ్మం, యర్రా రామకృష్ణ, నూకతోటి ఏడుకొండలు, ఎస్‌కే మస్తాన్‌వలి, పిల్లి పోగు జీవన్‌కుమార్, పచ్చవ వంశీ, గడ్డం వేణుబాబు పాల్గొన్నారు.

పారిశుధ్యంలో అలసత్వం వహిస్తే చర్యలు



పారిశుధ్య కార్మికులతో మాట్లాడుతున్న కలెక్టర్

ముండ్లమూరు(దర్శి): పారిశుధ్య నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తీసుకుంటామని కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా హెచ్చరించారు. మండలంలోని పూరిమెట్ల, కెల్లంపల్లి, పెద్ద ఉల్లగల్లు గ్రామాలను కలెక్టర్ మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా పారిశుధ్య నిర్వహణ, పీ-4 విధానంలో సర్వే తీరును పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. తొలుత కలెక్టర్ పూరిమెట్ల గ్రామాన్ని సందర్శించి పారిశుధ్య నిర్వహణను పరిశీలించారు. రోజూ క్షేత్రస్థాయిలో చెత్త సేకరణను పర్యవేక్షించాలని డిప్యూటీ ఎంపీడీఓలు, పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. ప్రజలకు సురక్షిత తాగునీరు అందించాల్సిన బాధ్యత పంచాయతీరాజ్ అధికారులపై ఉందన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన రోజుల్లో ఓవర్‌హెడ్ ట్యాంకులను క్లోరినేషన్ చేయాలని సూచించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పంచాయతీ కార్యదర్శి, ఏఈలు, వైద్య ఆరోగ్య సిబ్బంది సమన్వయంతో పనిచేయాలన్నారు. తాగునీటి పైప్‌లైన్లలో మురుగునీరు కలవకుండా తగు మరమ్మతులు చేయాలన్నారు. అనంతరం గ్రామస్తులతో ముఖాముఖి మాట్లాడారు. పారిశుధ్య నిర్వహణ ఏ విధంగా ఉంది, సంక్షేమ కార్యక్రమాల అమలు గురించి అడిగి తెలుసుకున్నారు. కెల్లంపల్లిలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించి వర్మీ కంపోస్టు తొట్టెలను పరిశీలించారు. గ్రామంలో చెత్త సేకరణ, సేకరించిన చెత్తను ఏ విధంగా వేరు చేస్తున్నారు వివరాలను అధికారులు కలెక్టర్‌కు వివరించారు. అనంతరం పెద్ద ఉల్లగల్లు గ్రామాన్ని సందర్శించి గ్రామంలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని, వర్మీ కంపోస్ట్ తొట్టెలు, వాటి పనితీరును పరిశీలించారు. కార్యక్రమంలో ఒంగోలు ఆర్డీఓ లక్ష్మీ ప్రసన్న, జిల్లా పరిషత్ సీఈఓ చిరంజీవి, డీపీఓ వెంకట నాయుడు, తహసీల్దార్ లక్ష్మీనారాయణ, ఎంపీడీఓ శ్రీదేవి, అధికారులు పాల్గొన్నారు.

వెంటాడిన వీధి కుక్కలు.. టీచర్‌కు గాయాలు

కంభం: బైక్‌పై వెళ్తున్న ఓ ఉపాధ్యాయుడిని వీధి కుక్కలు వెంబడించడంతో అదుపుతప్పి కిందపడి గాయాలపాలైన సంఘటన మంగళవారం కంభం సమీపంలో చోటుచేసుకుంది. వివరాలు.. చాట్ల బాబు అనే ఉపాధ్యాయుడు తన బైక్‌పై పాఠశాలకు వెళ్తుండగా కందులాపురం కాలనీ సమీపంలో కుక్కలు వెంబడించాయి. అదుపుతప్పి రోడ్డుపై పడిపోయిన టీచర్ ముఖానికి, చేతులు, కాళ్లకు రక్త గాయాలయ్యాయి. ఆయనను స్థానికులు కంభం ప్రభుత్వ వైద్యశాలకు తరలించి చికిత్స అందించారు. ఈ ప్రాంతంలో వీధికుక్కల బెడద అధికంగా ఉన్నా పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

కూటమి పాలనలో భ్రష్టుపట్టిన విద్యావ్యవస్థ

- ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సాయికుమార్
- ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయాలని ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ధర్నా



మాట్లాడుతున్న ఏఐఎస్ఎఫ్ నాయకుడు సాయికుమార్

కనిగిరిరూరల్: ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు వెంటనే విడుదల చేయాలని కోరుతూ ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో మంగళవారం ఆర్డీఓ కార్యాలయం వద్ద విద్యార్థులతో కలిసి మహాధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం సాయికుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో రూ.64 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు ప్రభుత్వం చెల్లించాల్సి ఉందన్నారు. ఆ ఆ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పీజీ విద్యార్థులకు విద్యను దూరం చేసే జీఓ నంబర్ 77ను తక్షణ రద్దు చేసి విద్యార్థుల భవిష్యత్‌ను కాపాడాలన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో విద్యా వ్యవస్థ భ్రష్టు పట్టిందన్నారు. పాలకులు విద్యార్థుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వకపోవడంతో కళాశాల యాజమాన్యాలు డిగ్రీ, ఇంజినీరింగ్, పీజీ పూర్తి చేసిన విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నాయన్నారు. కనిగిరిలో ఎస్సీ 2 బాలుర హాస్టల్‌ను మూసివేయాలని దుర్మార్గపు ఆలోచనను అధికారులు తక్షణం విరమించుకోవాలన్నారు. ఎస్సీ- 2 హాస్టల్‌ను కనిగిరిలోనే కొనసాగించాలని డిమాండ్ చేశారు. అనంతరం వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఆర్డీఓ కార్యాలయ అధికారులకు అందచేశారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు పవన్ కళ్యాణ్, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర నాయకులు సాదిక్ బాబు, కార్తీక్, శివకుమార్, రంజిత్, క్రాంతి, నియోజకవర్గ నాయకులు ఎస్‌కే తాహిద్‌బాషా, సయ్యద్ ఇఫ్రాజ్ తదితరులు పాల్గొన్నారు.

డీసెట్ కౌన్సెలింగ్ పొడిగింపు

ఒంగోలు సిటీ: మైనంపాడు ప్రభుత్వ జిల్లా విద్య శిక్షణ సంస్థలో డీ సెట్ కౌన్సెలింగ్‌ను మరో రెండు రోజులు పాటు 24వ తేదీ వరకు పొడిగించినట్లు డైట్ కళాశాల ప్రిన్సిపాల్ సామా సుబ్బారావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటి వరకు జిల్లాలో ఉన్న డైట్, రెండు ప్రైవేట్ డీఎడ్ కళాశాలలకు ప్రవేశాల కోసం 210 సీట్ల గాను 100 సీట్లు భర్తీ అయినట్లు పేర్కొన్నారు. అర్హులైన అభ్యర్థులు వెంటనే తమ సర్టిఫికెట్లను డైట్ మైనంపాడుకు తీసుకొని వచ్చి వెరిఫై చేయించుకొని సీటు పొందాలని కోరారు.

శ్రీధర్‌ను పరామర్శించిన మేరుగు



శ్రీధర్‌ను పరామర్శిస్తున్న మాజీ మంత్రి మేరుగు నాగార్జున

చీమకుర్తి: వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మన్నం శ్రీధర్‌ను మాజీ మంత్రి, సంతనూతలపాడు నియోజకవర్గ ఇన్‌చార్జి మేరుగు నాగార్జున మంగళవారం పరామర్శించారు. చీమకుర్తిలోని శ్రీధర్ నివాసంలో పార్టీ నాయకులుతో కలిసి మాట్లాడారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పొదిలి వచ్చిన సందర్భంగా పోలీసులు మన్నం శ్రీధర్‌పై అక్రమ కేసులు పెట్టడంతో దాదాపు 6 వారాల పాటు శ్రీధర్‌ను ఒంగోలు జైలులో ఉన్నారు. రెండు రోజుల క్రితం జైలు నుంచి విడుదలైన శ్రీధర్‌ను కలిసి పరిస్థితులు గురించి అడిగి తెలుసుకున్నారు. పార్టీ మళ్లీ అధికారంలోకి వస్తే పార్టీ నాయకులు, కార్యకర్తలకు మంచి రోజులు వస్తాయని భరోసా ఇచ్చారు. ఎంపీపీ యద్దనపూడి శ్రీనివాసరావు, పార్టీ మండల అధ్యక్షుడు పమిడి వెంకటేశ్వర్లు, పి.శ్రీమన్నారాయణ, ఏలూరి సురేష్, కుంచాల రాంబాబు, గంగిరెడ్డి ఓబుల్‌రెడ్డి, తెల్లమేకల గాంధీ, చీదర్ల శేషు, స్థానిక నాయకులు ఉన్నారు.

రేషన్, గ్యాస్ పంపిణీ పారదర్శకంగా చేయాలి

- ఇక నుంచి లబ్ధిదారుల నుంచి ప్రతిస్పందనలు తీసుకుంటాం
- డీలర్ల సమావేశంలో జేసీ గోపాలకృష్ణ



ఎల్పీజీ, పెట్రోలు బంకు డీలర్ల సమావేశంలో మాట్లాడుతున్న జేసీ గోపాల కృష్ణ

ఒంగోలు సబర్బన్: నిత్యావసర వస్తువులు, గ్యాస్ సరఫరా పారదర్శకంగా చేయాలని జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాల కృష్ణ ఆదేశించారు. ఈ మేరకు కలెక్టర్ కాన్ఫరెన్స్ హాలులో మంగళవారం ఎల్పీజీ, పెట్రోలు బంకు డీలర్లతో ఆయన ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా గోపాలకృష్ణ మాట్లాడుతూ రేషన్, ఎల్పీజీ డెలివరీపై ఐవీఆర్ఎస్ సంతృప్తి చెందారా, నిత్యావసర వస్తువుల నాణ్యత, డెలివరీ బాయ్ అవినీతికి పాల్పడుతున్నాడా వంటి ప్రశ్నావళికి అనుగుణంగా లబ్ధిదారుడి నుంచి ప్రతిస్పందనలను నిరంతరం తీసుకుంటామన్నారు. అలాంటి వాటిని సరిదిద్దుకోవాలని డీలర్లకు సూచించారు. దీపం-2 డెలివరీపై ప్రత్యేకంగా దృష్టి సారించాలన్నారు. పెట్రోలు బంకు, డీలర్లు స్టాక్ బోర్డులు వెంటనే ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో వివిధ విభాగాలకు చెందిన జిల్లా అధికారులు పాల్గొన్నారు.